క్లుప్తంగా

పేదలకు దుస్తులు, నిత్యావసరాల పంపిణీ


నిరుపేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు అందచేస్తున్న దృశ్యం

చింతలపూడి : డీపర్ లైఫ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం చింతలపూడిలో 85 మందికి రూ.10 వేల విలువ గల విద్యా సామాగ్రిని అందచేశారు. అదే విధంగా అనాథలకు, పేదలకు మరో రూ.10 వేలతో బియ్యం, నూతన దుస్తులు పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు రాజు మాట్లాడుతూ డీపర్ సొసైటీ ద్వారా నిరుపేదలకు చేతనైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంచర్ల బుచ్చిబాబు, రామకృష్ణ, క్రిస్టోఫర్, లలిత్ కుమార్, భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

కామవరపుకోట : వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తడికలపూడి ఎస్సై కె.వెంకన్న అన్నారు. శనివారం తడికలపూడిలోని ఎన్టీఆర్ బొమ్మ సెంటర్లో వాహనదారులను తనిఖీ చేసి వాహనాల రికార్డులను పరిశీలించారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణం సమయంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని అన్నారు. సరిగ్గా రికార్డులు లేని పదిమంది వాహనదారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్యాన రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): నిమ్మ, అరటి, కూరగాయల తదితర ఉద్యానవన పంటల రైతుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో శనివారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొండ పందిర్ల సబ్సిడీ బకాయిలు నాలుగేళ్లుగా ఇవ్వకపోవడం, మార్కెట్లో కనీస ధర రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని కోరారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీలు అందించాలన్నారు. సామాజిక వన విభాగం 2019–20 ఆర్థిక సంవత్సరంలో అటవీ శాఖ ద్వారా చేపట్టిన కొబ్బరి మొక్కల పెంపకం, పంపిణీలో చోటుచేసుకున్న భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

ఉచిత ఆయుర్వేద వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్పేట): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ప్రార్థనా గాన సంఘం భవనంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు ఐవీఎం నగేష్ 92 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారని లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు తెలిపారు. ప్రతి నెలా రెండో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రార్థనా గాన సంఘ భవనంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించాలి

ఏలూరు (టూటౌన్): దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల ప్రజలను వివక్షకు గురిచేసిన, మహిళల పట్ల వివక్ష చూపిన మనుధర్మ శాస్త్రం అమలు చేయాలనే బీజేపీ ప్రభుత్వం వైఖరిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలోని ఐద్వా జిల్లా కార్యాలయంలో కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ మనుధర్మ శాస్త్రం పద్ధతులను అమలు చేయాలని చూస్తోందని, దీనికి ఇటీవల పార్లమెంటులో సతీ సహగమనం మన సంప్రదాయం, దీన్ని అమలు చేయాలని సాక్షాత్తు బీజేపీ ఎంపీ ప్రకటించడమే నిదర్శనమని వివరించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్యాస్ సిలిండర్ ధర రూ.400 నుంచి రూ.1100కు, పెట్రోల్ లీటరు రూ.45 నుంచి రూ.112కు పెరిగిందని, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు నిర్మల, దివ్య, ఉషారాణి, జి.శారద, పెద్దాని సుకన్య పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్పేట): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 18 వరకు మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆ శాఖ నిర్వాహకురాలు బీకే లావణ్య తెలిపారు. శనివారం స్థానిక బ్రహ్మకుమారీస్ ఏలూరు శాఖ సేవా కేంద్రంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 12వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభిస్తారని, దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను స్థానిక శ్రీరామ్ నగర్లోని తమ సేవా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు, బ్రహ్మకుమారీస్ వరంగల్ జోన్ డైరెక్టర్, రాజయోగిని బీకే సవిత, బీకే సుధాకర్ పాల్గొంటారన్నారు.

లోక్ అదాలత్‌లో 390 కేసుల పరిష్కారం

చింతలపూడి : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 390 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. వాటిలో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు 59 కాగా, 3 సివిల్ కేసుల్లో రూ.21,78,177 వసూలు చేశారు. అదే విధంగా 4 చెక్‌బౌన్స్ కేసుల్లో రూ.9,20,000 వసూలు చేశారు. 291 ఎస్‌టీసీ (న్యూసెన్స్) కేసుల్లో 8,00,000, 26 బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసుల్లో రూ.36,471, 7 బ్యాంక్ బకాయి కేసుల్లో రూ.68,800 వసూలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో లోక్ అదాలత్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఇరుపక్షాలు రాజీ పడటం ద్వారా ఇరుపక్షాలు గెలిచినట్లేనని చెప్పారు. కోర్టుకు కట్టిన ఫీజులు


చింతలపూడి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్

కూడా తిరిగి పొందే అవకాశం లోక్ అదాలత్‌లో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ వి.సామయ్య, సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరుకుళ్ళ సత్యన్నారాయణ, బలుసు సత్యన్నారాయణ, ఎండీ అక్బర్ ఆలీ లోక్‌అదాలత్ సభ్యులుగా వ్యవహరించారు.

664 కేసులు పరిష్కారం

జంగారెడ్డిగూడెం : స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆర్.వరలక్ష్మి కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఐపీసీ 87 కేసులు, ఎంసీ 1, సివిల్ 11, చెక్కుబౌన్స్ 4, బెంచ్ కోర్టు 534 కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు 15, బ్యాంకు కేసులు 12 మొత్తం 664 కేసులు పరిష్కారం అయినట్లు వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ విమలాదేవి, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, బార్ సభ్యులు, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు ప్రేమను తోటివారికి పంచాలి

లింగపాలెం : సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు ఆధ్యాత్మిక కేంద్రాలైన దేవాలయాలు దోహదపడతాయని ఏలూరు బిషప్ పొలిమెర జయరావు అన్నారు. మండలంలోని తోచలకరాయుడుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని శనివారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ చర్చి నిర్మాణానికి సంఘస్తులు, విశ్వాసులు రూ.15 లక్షలు అందించగా, ఫాదర్ ఆదాం రూ.15లక్షలు సమకూర్చారు. తొలుత ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం బిషప్ జయరావు మాట్లాడారు. క్రీస్తు చూపించిన ప్రేమను ఇతరులకు పంచి సోదరభావంతో కలసిమెలసి జీవించాలన్నారు. దేవుడుకి, మానవుడికి మధ్య ఎల్లప్పుడూ మరియమాత వారిధిగా ఉండి మానవాళి కోరికలను తీరుస్తుందన్నారు. యువత సమాజాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలన్నారు. క్రీస్తు సందేశం లోకాన్ని శాంతి మార్గంలో పయనించేలా చేస్తుందన్నారు. అనంతరం సంఘస్తులు, ఫాదర్లు కలిసి బిషప్ జయరావును ఘనంగా సన్మానించారు. భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు, ఎంపీటీసీలు పొదిల మరియమ్మ, వడ్లాని శ్రీలలిత, పార్టీ నాయకులు కోటగిరి ధీరాజ్ కృష్ణ, కోటగిరి హరీష్, సొంగా సందీప్, ఫాదర్ జి.ఆనంద్‌బాబు, సహాయక గురువులు ఫాదర్ జాన్ సందీప్, ఫాదర్ పి బాల, పొదిల బాబురావు, ప్రసాద్, రాజా, ఎల్.శేషయ్య, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.


తోచలకరాయుడుపాలెం ఆర్‌సీఎం చర్చి వద్ద ప్రసంగిస్తున్న ఏలూరు బిషప్ జయరావు

భక్తులకు మెరుగైన సేవలందించాలి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందించే దిశగా నూతన ధర్మకర్తల మండలి పనిచేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్(నాని) అన్నారు. చినవెంకన్న దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలిగా ఈనెల 9న ప్రమాణస్వీకారం చేసిన ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, ఆమె భర్త జ్యోతి శ్రీనివాస్ శనివారం ఆళ్ల నానిని ఏలూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, తణుకు నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మార్డీ బలరాం దంపతులతో కలసి వారు నానికి పూలబొకేను అందజేశారు. తాను ట్రస్టుబోర్డు సభ్యురాలిగా నియమితులు కావడం అదృష్టంగా భావిస్తున్నట్టు పద్మ తెలిపారు. ఇదిలా ఉంటే గోపాలపురం నియోజవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ)ని పల్లంట్లలోని ఆయన నివాసం వద్ద వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు మర్యాద పూర్వకంగా కలసి, ఆయనను ఘనంగా సత్కరించారు.


ఆళ్ల నానికి పూల బొకేను అందజేస్తున్న పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు

బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని ధర్నా

జంగారెడ్డిగూడెం : విద్యార్థులకు, ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా బస్సు రూటును పునరుద్ధరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ కోరారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో వద్ద శనివారం విద్యార్థులు, ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి శ్రీనివాసపురం, జైనవారిగూడెం, పట్టెన్నపాలెం, రామారావుపేట సెంటర్, కర్రెడ్లగూడెం, రెడ్డిగణపవరం గ్రామాలకు ప్రతిరోజు ఆరు ట్రిప్పులు బస్సు సర్వీసు నడిచేదన్నారు. ప్రస్తుతం సర్వీసును వేరే రూటుకు మార్చడంతో బస్సు సౌకర్యం లేక, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించలేక, విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున అందరికి ఆమోదయోగ్యమైన సమయాల్లో బస్సు సర్వీసులు నడుపాలని కోరారు. దాసరి శ్యామ్, విద్యార్థులు మౌనిక, ఫణి, బి.శివ, ఎం.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.


బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ధర్నా చేస్తున్న విద్యార్థులు

లూర్దు మాత ఉత్సవాల పోస్టల్ ఆవిష్కరణ

కామవరపుకోట : మండలంలోని రోమన్ క్యాథలిక్ మిషన్ తడికలపూడి విచారణ పరిధిలో మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు లూర్దు మాత ఉత్సవాలు పురస్కరించుకుని శనివారం గోడ పోస్టర్‌ను జెడ్పీటీసీ కడిమి రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ప్రేమ, త్యాగం, కరుణ చాటి చెప్పిన వ్యక్తి ఏసుక్రీస్తు అని, అలాంటి వ్యక్తికి తల్లి అయిన లూర్దు మాతాను విశ్వాసంతో నమ్మితే కోర్కెలు తీరుతాయని ఇక్కడ ప్రజలు నమ్ముతారని అన్నారు ఈ కార్యక్రమంలో ఫాదర్ దోమతోటి నతానియలు, సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీ కొప్పర్తి లక్ష్మి నాగేంద్ర, వీఆర్వో రమేష్, హార్టికల్చర్ అధికారి ప్రేమ్, మేరుగు నాగరాజు, ప్రొద్దుటూరి ప్రసాద్, సుధీర్ తాటేష్ పాల్గొన్నారు.


లూర్దు మాత గోడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ కడిమి రమేష్

రోటరీ క్లబ్ వృద్ధాశ్రమం ప్రారంభం

కొయ్యలగూడెం : సేవే పరమావధిగా ముందుకు సాగుతున్న రోటరీ క్లబ్, వృద్ధాశ్రమ నిర్వహణలోనూ స్ఫూర్తిదాయకంగా నిలవాలి అని మదన గోపాల స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, ప్రముఖ దాత కిళ్ళాంబి వెంకటాచార్యులు పేర్కొన్నారు. శనివారం జంగారెడ్డిగూడెం రోడ్డులోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతన వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. వెంకటాచార్యులకు చెందిన రెండున్నర ఎకరాల విస్తీర్ణంలోని భవనాలను వృద్ధాశ్రమ నిర్వహణ నిమిత్తం రోటరీ క్లబ్ సంస్థకు ఇటీవల అందజేశారు. నిరాదరణకు గురైన అన్ని వర్గాల వృద్ధులు ఆశ్రమంలో ఆశ్రయం పొందవచ్చు అని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, సంకు కొండ తెలిపారు. వృద్ధాశ్రమ నిర్వహణకు భవనాలను అందజేసిన వెంకటాచార్యులని క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు.


వృద్ధాశ్రమ నిర్వహణకు భవనాన్ని ఉచితంగా ఇచ్చిన వెంకటాచార్యులని సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు క్రీడాకారులు


అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు వెళుతున్న ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం జట్టు

దెందులూరు: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం (రాజమండ్రి) మహిళలు, పురుషుల జట్లు ఆదివారం బెంగుళూరులో నిర్వహించనున్న అంతర విశ్వవిద్యాలయాల 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తా నియేల్ కోరారు. మహిళల విభాగంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ జట్టు తరపున పోటీపడనున్న వీ.పూజ, డీ. లీలావతి, జీ. నంది, ఎస్. లక్ష్మి, వీ. గంగాభవాని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యకళాశాలకు చెందిన విద్యార్థినులని ఆయన తెలిపారు. ఈ టీంకు మేనేజర్‌గా ఎస్. వెంకటేశ్వరరావు వ్యవహరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం. మనోహర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీకేవీ ప్రసాద్, లెక్చరర్లు శ్యామలాదేవి, రమేష్, జయలక్ష్మి, సిబ్బంది జట్టును అభినందించారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం : స్థానిక గోకులతిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థ ప్రసాదగోష్ఠి తదితదర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. పాదయాత్ర ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు జంగారెడ్డిగూడెంకు చెందిన బాల సూర్య వేంకట హనుమాన్, ఖమ్మంకు చెందిన సుదీప్ చంద్రహాస్ అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.శ్రీహరిరావు, రెడ్డి రంగప్రసాద్, దండు ధనరాజు, వాసవి సాయినగేష్ పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు

అంజన్న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన


ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : శోభనాద్రిపురంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి విగ్రహ ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు, వేద పండితుల సమక్షంలో పూజాధికాలు చేశారు. ఆధ్యాత్మికవేత్తలు తమ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

18 నుంచి శివరాత్రి ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం : మహాశివరాత్రి సందర్భంగా స్థానిక రాజీవ్ నగర్‌లో స్వయంభువుగా వెలిసిన ఓంకారేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18వ తేదీ నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కరపత్రాన్ని విడుదల చేశారు. ఆలయంలో ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవతో ఆరోజు కార్యక్రమాలు మొదలవుతాయని, పంచామృతాభిషేకాలు, మహాశివునికి పూజ, రత్నలింగ దర్శనం, కల్యాణ మహోత్సవం, కన్యాదానం, భజన కార్యక్రమం, అన్నసమారాధన, లలితా విష్ణు సహస్రనామ పారాయణ, దీపోత్సవం, పల్లకీసేవ, గ్రామోత్సవం, దశశాంతి పారాయణ, ఏకాదశ రుద్రాభిషేకం, లింగోద్భవం వంటి కార్యక్రమాలు రాత్రి 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. కాగా ఉదయం 8.30 గంటలకు నిర్వహించే శివపార్వతుల కల్యాణంలో పాల్గొనదలచిన వారు ఆలయ కమిటీకి ముందుగా తెలియజేయాలన్నారు. వివరాలకు 94411 01804, 94403 62337 నంబరులో సంప్రదించాలన్నారు.

ముక్కు రామయ్యకు సీపీఐ నాయకుల పరామర్శ

టి.నరసాపురం : ఇటీవల అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన సీపీఐ సీనియర్ కార్యకర్త ముక్కు రామయ్యను ఆ పార్టీ నేతలు, ఇతర సంఘాల నేతలు శనివారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ఆయనకు భరోసా ఇచ్చారు. భూపోరాటాల్లో ప్రజల పక్షాన నిలిచి, ప్రజలకు అండగా ఉన్న ముక్కు రామయ్యను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి మామిళ్ళపల్లి వసంతరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, జిల్లా సమితి సభ్యులు టీవీఎస్ రాజు, తుర్లపాటి బాబు, కంకిపాటి బుచ్చిబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

అలరించిన పౌరాణిక నాటక ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్పేట): 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా శనివారం నాటక కళాకారులు ప్రదర్శించిన పౌరాణిక నాటకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపానలు, హరేరామ సంకీర్తనలు చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీసీతారామాంజనేయ భక్త సమాజం బృందం ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజలు నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వేదాంతం విష్ణుప్రసాద్ హైందవ ధర్మ విశిష్టత అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి 7 గంటలకు పెరికిగూడెంకు చెందిన శ్యామలాంబ కళానికేతన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకంలోని మయ సభ, పడక సీనులను వి.రామాంజనేయులు (శ్రీకృష్ణుడు), బి.అప్పారావు (అర్జునుడు), ఎస్.సీతారామయ్య (దుర్యోధనుడు) తమతమ పాత్రలతో ఆద్యంతం రక్తి కట్టించారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం


పి.కన్నాపురంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: మండలంలోని పి.కన్నాపురంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం ఉదయం ప్రారంభించారు. ఈనెల 13 వరకు ఈ టోర్నమెంట్ జరుగుతుందని, ఇందులో గెలుపొందిన విజేతలకు ఆఖరి రోజు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ డీజే రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొండాడ వెంకన్నబాబు, స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సందడిగా వారాంతపు సంత

బుట్టాయగూడెం : మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో శనివారం వారాంతపు సంత నిర్వహించారు. ఈ సంత ఏజెన్సీ ప్రాంతంలోనే అతి పెద్దది. పరిసర ప్రాంత గిరిజన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇక్కడి సంతకు తరలివచ్చి సరుకులు, కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. గతంలో రాత్రి 9 గంటల వరకూ కూడా విద్యుత్ వెలుగుల్లో సంత నిర్వహణ జరిగేది. అయితే కోవిడ్–19 ప్రభావంతో అధికారులు సంతను నిషేధించడంతో పాటు కోవిడ్ పరిస్థితుల దృష్ట్యా సంతలకు జనం రావడం మానివేశారు. దీనికి తోడూ గ్రామాల్లోనే తోపుడు బండ్లు, ఆటోల్లో సరుకులు అందుబాటులోకి రావడంతో సంత ప్రభావం తగ్గుతూ వచ్చింది. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతంలో వర్జీనియా పొగాకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులకు గుంటూరుతో పాటు పలు జిల్లాలకు చెందిన వలస కూలీలు అధికంగా వచ్చారు. దీనితో ఈ వారం సంతకు అధిక జనాభా రావడంతో సందడిగా కనిపించింది.


వారాంతపు సంత జనంతో రద్దీగా ఉన్న దృశ్యం

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జంగారెడ్డిగూడెం : ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. శనివారం ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న బ్లాక్‌స్పాట్‌లను వాహనదారులు గుర్తించేలా జంగారెడ్డిగూడెం నుంచి అశ్వరావుపేట వెళ్లే రోడ్డులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. యాక్సిడెంట్ స్పాట్ 100 మీటర్ల దూరంలో ప్రయాణీకులకు కనిపించే విధంగా సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా వాహనదారులకు సైతం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నామన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై సాగర్ బాబు చెప్పారు.



ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్‌ను సూచిస్తూ బోర్డును ఏర్పాటు చేస్తున్న ఎస్సై ఎం.సాగర్‌బాబు

వసంత్‌నగర్‌లో తాటాకిల్లు దగ్ధం

భీమడోలు: అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వసంత్‌నగర్ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం రాత్రి ఓ తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. బొంతు కృష్ణకుమారి ఇంట్లోంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి తాటాకిల్లు పూర్తిగా దగ్గమైంది. ఈ ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. భీమడోలు అగ్నిమాపక అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. గృహోపకరణాలు మంటల్లో కాలిపోయాయి. బాధిత కుటుంబం నిరాశ్రయులైంది.

పంచముఖి ఆంజనేయస్వామికి విశేష పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని దేవులపల్లిలో కొలువై ఉన్న శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దేవస్థానం 14వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి సింధూర సహిత లక్ష తమలపాకుల పూజ, శాంతి కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు, గోపూజ, హోమాలు వంటి పూజాదికాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు కర్పూరం నాగరాజు, ఆంజనేయ గుప్త ఏర్పాట్లను పర్యవేక్షించారు.


స్వామికి లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించిన దృశ్యం

శుభకార్యాలతో క్షేత్రం కళకళ

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రం శనివారం శుభకార్యాలతో కళకళలాడింది. మంచి ముహూర్తం కావడంతో ఉదయం ఆలయ అనివేటి మండపంలో వివాహాలు, ఉపనయనాలు పెద్ద సంఖ్యలో జరిగాయి. దీంతో పెళ్లి జనాలతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. శుభకార్యాలు ముగిసిన అనంతరం నూతన వధూవరులు, ఒటువులు, వారి బంధుమిత్రులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.